అద్దె భారం.. అవస్థలమయం!

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సామాజిక వర్గాల పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం మంజూరు చేసిన గురుకుల విద్యాసంస్థలకు సొంత భవనాలు కరువయ్యాయి. ఏళ్ల నుంచి అద్దె భవనాల్లో కొనసాగుతుండగా కనీస మౌలిక సదుపాయాలు లేక విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. బెల్లంపల్లి ఎస్సీ అసెంబ్లీ నియోజకవర్గంలో గురుకులాలు అధ్వానంగా ఉన్నా ఎంపీ, ఎమ్మెల్యేలు శ్రద్ధ చూపడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక్కో గురుకుల విద్యాలయంలో 640 మంది చొప్పున ఏడు గురుకులాల్లో మొత్తం 4,480మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ గురుకులాలను నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వం చెప్పుకోవడం తప్పా ఆచరణలో అమలుకావడం లేదు. – బెల్లంపల్లి


అద్దె భవనంలో బెల్లంపల్లిలోని మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకులం

గతంలోనే ప్రతిపాదనలు పంపారు



సంక్షేమ గురుకులాలకు సొంత భవనాల నిర్మాణాల కోసం ప్రభుత్వానికి ఇప్పట్లో ప్రతిపాదనలు పంపలేదు. గతంలో ప్రతిపాదనలు పంపించినట్లు సమాచారం ఉంది. రాష్ట్రంలో కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం సమీకృత గురుకులాలను ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి ఒకటి చొప్పున మంజూరు చేయడానికి సిద్ధమైంది. సమీకృత గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అవకాశం కల్పిస్తారు.

– అరుణకుమారి, సంక్షేమ గురుకులాల జోనల్ అధికారి, కాళేశ్వరం

- ప్రభుత్వ గురుకులాలకు పక్కా భవనాలు కరువు
- ప్రతినెలా రూ.లక్షల్లో అద్దె చెల్లింపులు
- ఇరుకు గదుల్లో విద్యార్థులకు తప్పని తిప్పలు
- ఆటస్థలాలు లేక క్రీడలకు సైతం దూరం


బెల్లంపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న మైనార్టీ బాలికల గురుకులం

నాలుగు అద్దె భవనాల్లోనే...

అసెంబ్లీ నియోజకవర్గంలో ఏడు ప్రభుత్వ గురుకులాలు ఉన్నాయి. వీటిని బెల్లంపల్లి, తాండూర్, కాసిపేట మండలాల్లో ఏర్పాటు చేశారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర సీవోఈ(సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ) గురుకుల పాఠశాల/కళాశాల, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల, ప్రభుత్వ మైనార్టీ బాలికల గురుకుల పాఠశాల/కళాశాల, మహాత్మాజ్యోతిబా పూలే బాలికల గురుకుల పాఠశాల/కళాశాలలతో పాటు కాసిపేట మండలానికి మంజూరైన సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల/కళాశాల, టీజీఆర్ఎస్ పాఠశాల/కళాశాల బెల్లంపల్లిలో ఉంది. తాండూర్ మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల/కళాశాల నిర్వహిస్తున్నారు. వీటిలో ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర సీవోఈ, సంక్షేమ బాలికల, టీజీఆర్ఎస్ బాలుర గురుకుల విద్యాలయాలకు సొంత భవనాలు ఉండగా అన్ని మౌలిక వసతులు కల్పించారు. మిగితా గురుకులాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఒక్కో గురుకుల విద్యాలయానికి రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తున్నా సొంత భవనం నిర్మించాలనే పట్టుదల ప్రభుత్వానికి లేకుండా పోయిందనే విమర్శలు ఉన్నాయి. అద్దె బకాయిలు పేరుకుపోవడంతో ఇటీవల భవనాల యజమానులు తాళం వేయడం గమనార్హం.

గురుకులాల్లోని సమస్యలు...

☞ బెల్లంపల్లిలోని ప్రభుత్వ మైనార్టీ బాలికల గురుకుల విద్యాలయం అద్దె భవనంలో కొనసాగుతుండగా విద్యార్థులకు ఆటవిడుపు లేకుండా పోయింది. నాలుగు గోడల మధ్య ఒకరకంగా జైలు జీవితాన్ని గడుపుతున్న పరిస్థితులు ఉన్నాయి. క్రీడా మైదానం లేక ఆటలకు దూరమవుతున్నారు. గురుకులం వెనకాల తిలక్ స్టేడియం ఉన్నా ఆటలు ఆడే పరిస్థితులు లేవు. దీంతో క్రీడలపై ఆసక్తి ఉన్నా ప్రయోజనం లేకుండా పోతోంది. తరగతి గదుల్లో, డార్మెటరీలో ఉండాల్సి వస్తున్నా బాలికలు సూర్యరశ్మికి నోచుకోలేకపోతున్నారు. ఇరుకిరుకుగా ఉన్న గదుల్లో అతికష్టంగా చదువుకుంటున్నారు. మైనార్టీ బాలికల గురుకుల విద్యాలయానికి తాండూర్‌కు వెళ్లే మార్గంలో నేషనల్ హైవేను ఆనుకొని పక్కా భవనం నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని కేటాయించారు. ఏళ్లు గడుస్తున్నా పక్కా భవనం నిర్మించకపోవడంతో అద్దె భవనంలో ఉండాల్సి వస్తోంది.

☞ కాసిపేట మండలానికి మంజూరైన ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయాన్ని బెల్లంపల్లి శివాలయం వెనకాల ఉన్న అద్దె భవనాల్లో నడుపుతున్నారు. ఇక్కడ విద్యార్థులకు సరైన వసతి లేదు. తరగతి గదులు, డార్మెటరీల్లో విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

☞ బెల్లంపల్లిలో నిర్వహిస్తున్న మహాత్మా జ్యోతిబా పూలే బాలికల గురుకుల విద్యాలయం కూడా అద్దె భవనంలో కొనసాగుతోంది. సొంత భవనం లేక అరకొర సౌకర్యాలతో బాలికలు పడరాని పాట్లు పడుతున్నారు.

☞ తాండూర్ మండలానికి మంజూరైన మహాత్మాజ్యోతిబా పూలే బాలుర గురుకులాన్ని అద్దె భవనంలో కొనసాగిస్తున్నారు. ఇక్కడ విద్యార్థులకు ఆటస్థలం లేక నానా యాతన పడుతున్నారు. సరిపడా గదులు లేక అసౌకర్యానికి గురవుతున్నారు.

క్లుప్తంగా

కోనో కార్పస్ చెట్లను తొలగించాలి

బెల్లంపల్లి: శ్వాస సంబంధిత సమస్యలకు కారణమవుతున్న కోనో కార్పస్ మొక్కలను వెంటనే తొలగించాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి ఎస్.రాజేంద్రప్రసాద్, సహాయ కార్యదర్శి పి.వెంకటేష్ డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఫారెస్టు డివిజనల్ కార్యాలయం ఎదుట మంగళవారం నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం అందజేశారు.

‘ఆరోపణలు చేస్తే ఊరుకోం’

దండేపల్లి: మంచిర్యాల నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా ముందుకెళ్తున్న ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావుపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం సరికాదని ఆర్‌జీపీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గడ్డం త్రిమూర్తి పేర్కొన్నారు. దండేపల్లిలో మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ఎమ్మెల్యేపై ఆరోపణలు మానుకోవాలి, లేకుంటే ఊరుకోబోమని హెచ్చరించారు. సమావేశంలో లక్సెట్టిపేట మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేంచంద్, మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాడాలి

మంచిర్యాలఅర్బన్: విద్య కాషాయికరణ, ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటానికి సిద్ధం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. మంచిర్యాలలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్లో మంగళవారం పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.శ్రీకాంత్ అధ్యక్షతన పీడీఎస్‌యూ 50వ అర్ధశతాబ్ద వారోత్సవాల సందర్భంగా సభ నిర్వహించారు. పూర్వ విద్యార్థులు, పీడీఎస్‌యూ నాయకులు రెడ్డిమల్ల ప్రకాశం, లాల్‌కుమార్, అందే మంగ, శ్రీనివాస్‌లు హాజరయ్యారు.

‘బీఆర్ఎస్‌కు కాంగ్రెస్ శ్రేణుల సవాల్’

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఆధారాలతో అవినీతి బయట పెట్టడానికి సిద్ధంగా ఉన్నాం.. ఎదుర్కోవడానికి మీరు సిద్ధమా అని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పూదరి తిరుపతి, హాజీపూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు తోట రవి బీఆర్ఎస్‌కు సవాల్ విసిరారు. హాజీపూర్ మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు అర్థంలేని గొడవలకు దిగుతూ, మండలంలో భయాందోళనలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కఠినంగా శిక్షించాలి

బెల్లంపల్లి: కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్ అభయపై లైంగిక దాడి చేసి హత్య చేసిన దుర్మార్గులను గుర్తించి, అరెస్టు చేయడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్ విమర్శించారు. డబ్ల్యూడీజేడీఎఫ్ పిలుపు మేరకు మంగళవారం బెల్లంపల్లిలో నోటికి నల్ల రిబ్బన్ కట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఇఫ్టూ నాయకులు పాల్గొన్నారు.

వర్షాలు కురువాలని పూజలు



కోటపల్లి/వేమనపల్లి: వర్షాలు కురువాలని, పంటలు సంవృద్ధిగా పండాలని శరణు కోరుతూ కోటపల్లి, వేమనపల్లి మండలాల్లోని పలు గ్రామాల ప్రజలు మంగళవారం తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దు గ్రామమైన తేకడకు తరలివెళ్లారు. కుంకుమయ్య గుట్టలోని శివలింగానికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఏటా పంటల సీజన్‌లో అక్కడికి కాలినడకన వెళ్లడం ఆనవాయితీ.

క్రైం కార్నర్..

గంజాయి పట్టివేత

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బురదగూడెం సమీపంలో ప్రభుత్వ నిషేధిత గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న ముగ్గురు వ్యక్తులను పట్టుకున్నట్లు మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి తెలిపారు. సర్కిల్ కార్యాలయంలో మంగళవారం వివరాలు వెల్లడించారు. బురదగూడెం సమీపంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గంగాధర్, ఇద్దరు మైనర్లు పోలీస్ సిబ్బందిని చూసి పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని పట్టుకుని విచారించగా వారి వద్ద 400గ్రాముల గంజాయి లభించింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్సై రాజశేఖర్, ఏఎస్సై శ్రీనివాస్, మల్లేష్, మజీద్, సిబ్బంది ఉన్నారు.

పేకాటశిబిరంపై దాడి

భీమిని: మండలంలోని వీగాం గ్రామ శివారులో మంగళవారం పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని పట్టుకున్నారు. వారిపై కేసు నమోదు చేసి, ఐదు సెల్‌ఫోన్లు, రూ.750స్వాధీన పర్చుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు కన్నెపల్లి ఎస్సై గంగారాం తెలిపారు.

‘మంచి మంచిర్యాల’ దొంగలను పట్టుకోవాలి

- మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు


ఆందోళన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు

మంచిర్యాలటౌన్: గత బీఆర్ఎస్ ప్రభుత్వం మున్సిపల్ పట్టణ ప్రగతి నిధులు రూ.20లక్షలతో నిర్మించిన సెల్ఫీ పాయింట్‌లోని ‘మంచి మంచిర్యాల’ అక్షరాలను గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారని, వెంటనే వారిని పట్టుకొని చర్యలు తీసుకోవాలని మంచిర్యాల మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఐబీ చౌరస్తాలోని సెల్ఫీ పాయింట్ వద్ద బీఆర్ఎస్ నాయకులతో కలిసి మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంచి మంచిర్యాల అక్షరాలను దొంగతనం చేసిన దానిపై మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి, దొంగలను పట్టుకునేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణ నడిబొడ్డున ఉన్న అక్షరాలను దొంగతనం చేశారంటే, మంచిర్యాల ఎటు వెళ్తుందోనని ఒకసారి ప్రజలు ఆలోచించాలన్నారు. అక్షరాల దొంగలను పోలీసులు కనిపెట్టి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ పెంట రాజయ్య, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అంకం నరేశ్, డీసీసీబీ డైరెక్టర్ ఎర్రం తిరుపతి, తాజుద్దీన్, గోగుల రవీందర్ రెడ్డి, పడాల రవీందర్, నాయకులు పాల్గొన్నారు.

అక్షరాలను మేమే తీశాం

- మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య


మాట్లాడుతున్న ఉప్పలయ్య, వేణు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని ఐబీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌లోని ‘మంచి మంచిర్యాల’ అక్షరాలను ఎవరూ దొంగలించడం, ఎత్తుకుపోవడం చేయలేదని, మున్సిపల్ కార్యాలయంలో భద్రంగా ఉన్నాయని మంచిర్యాల మున్సిపల్ చైర్మన్ రావుల ఉప్పలయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నస్పూర్ మున్సిపల్ చైర్మన్ సురిమిల్ల వేణు, పీసీసీ ప్రధాన కార్యదర్శి చిట్ల సత్యనారాయణతో కలిసి మాట్లాడారు. ఐబీ ఆవరణలో మాతాశిశు ఆసుపత్రి నిర్మిస్తుండడం వల్ల అక్షరాలు దెబ్బతినే ప్రమాదం ఉందని, ముందు జాగ్రత్తగా మున్సిపల్ కార్యాలయానికి తరలించామన్నారు. కమిషనర్‌కు సమాచార లోపంతో తెలియదని చెప్పాడన్నారు. ఇష్టానుసారంగా ప్రతిపక్ష నేతలు విమర్శలు చేయొద్దన్నారు. మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు, తన కుమారుడు నడిపెల్లి విజిత్ రావును ఎమ్మెల్యే చేయాలని పగటి కలలు కంటున్నారని, ఇకనైనా ఆ కలలను మానుకోవాలని కాంగ్రెస్ నేతలు హితవు పలికారు.

పారిశుధ్య పనులు నిరంతరం కొనసాగించాలి

- జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు


రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

నెన్నెల: గ్రామాల్లో పారిశుధ్య పనుల నిరంతరం కొనసాగించాలని జిల్లా పంచాయతీ అధికారి డి.వెంకటేశ్వర్ రావు అన్నారు. నెన్నెల పంచాయతీ కార్యాలయాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి కార్యదర్శి సురేష్‌కు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం శ్మశాన వాటిక, డంపింగ్‌యార్డును పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేరు చేసే ప్రక్రియను అడిగి తెలుసుకున్నారు. కస్తూరిబా పాఠశాలను సందర్శించి మధ్యాహ్న భోజనం స్టాక్ రిజిష్టర్లు పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కేజీబీవీ సిబ్బందిని ఆదేశించారు. నెన్నెల నూతన నర్సరీలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీవో దేవేందర్‌రెడ్డి, ఎంపీవో శ్రీనివాస్‌లు ఉన్నారు.

యువ ఉద్యోగులపైనే సింగరేణి భవిష్యత్

- శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి


నియామక పత్రాలు అందిస్తున్న జీఎం

శ్రీరాంపూర్: యువ ఉద్యోగులపైనే సింగరేణి భవిష్యత్ ఆధారపడి ఉందని శ్రీరాంపూర్ జీఎం బీ.సంజీవరెడ్డి తెలిపారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం 28మందికి కారుణ్య ఉద్యోగ నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగంలో చేరిన తర్వాత సర్ఫేస్‌లో లైట్ జాబ్ కోసం ప్రయత్నించకుండా కంపెనీ చెప్పిన పని చేయాలన్నారు. క్రమశిక్షణతో పనిచేసి ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. కార్యక్రమంలో ఏరియా ఎస్‌ఓటూ జీఎం సత్యనారాయణ, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ కార్యదర్శి షేక్ బాజీ సైదా, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి, డీజీఎం (పర్సనల్) అరవింద రావు, సీనియర్ పీఓ కాంతారావు, అసిస్టెంట్ సూపరిండెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

బదిలీల కోసం కౌన్సెలింగ్


కౌన్సెలింగ్‌కు హాజరైన ఉద్యోగులు

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియా నుంచి మందమర్రి ఏరియాకు చార్జ్‌హ్యాండ్, ఎలక్ట్రికల్ ఫోర్‌మెన్ బదిలీల కోసం మంగళవారం డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవులు హాజరై కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 23మంది ఈ కౌన్సెలింగ్‌కు హాజరు కాగా ఇందులో 10మంది వెబ్ ఆప్షన్ పెట్టుకొని బదిలీ అయ్యారు. కార్యక్రమంలో వీటీసీ ఇన్‌చార్జి మేనేజర్ అమర్నాథ్‌రెడ్డి, డెప్యూటీ పీఎం రాజేశ్వర్ రావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీధర్ పాల్గొన్నారు.

రెసిడెన్షియల్ ఇన్ హౌజ్ ట్రైనింగ్ ప్రోగ్రాంకు ఎంపిక

మందమర్రిరూరల్: ఈ నెల 23నుంచి 26వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో గల ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ)లో సింగరేణి ఆధ్వర్యంలో నిర్వహించే రెసిడెన్షియల్ ఇన్ హౌజ్ ట్రైనింగ్ కార్యక్రమానికి మందమర్రి ఏరియా నుంచి ఏఐటీయూసీ ఏరియా బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ(సర్ఫేస్ జనరల్ మజ్దూర్), ఐఎన్టీయూసీ నుంచి ఆ యూనియన్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ కాంపెల్లి సమ్మయ్య(సీనియర్ మైనింగ్ సర్దార్) ఎంపికయ్యారు. ట్రేడ్ యూనియన్ ఎన్నికల్లో ఎన్నికైన గుర్తింపు, ప్రాతినిధ్య హోదా పొందిన సంఘాల్లో ఎంపిక చేసిన ప్రతినిధుల కోసం యాజమాన్యం ఈ ప్రోగ్రాంను ఏర్పాటు చేసింది. ఈఎస్‌సీఐ హైదరాబాద్ నుంచి ఎక్స్‌టర్నల్ ఫ్యాకల్టీ, సింగరేణి నుంచి ఇంటర్నల్ ఫ్యాకల్టీ సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనుంది.

నర్సరీలను సందర్శించిన డీఆర్డీవో


పోలంపల్లిలో పనులు పరిశీలిస్తున్న డీఆర్డీవో కిషన్

భీమారం/చెన్నూర్‌రూరల్: భీమారం మండలం పోలంపల్లి, చెన్నూర్ మండలంలోని సోమనపల్లి, ఆస్నాద, పొన్నారం, సంకారం గ్రామాల్లోని నర్సరీలను మంగళవారం డీఆర్డీవో కిషన్ పరిశీలించారు. ఎర్రమట్టి, నల్లమట్టి సేంద్రీయ ఎరువులతో బ్యాగ్ ఫిల్లింగ్ చేసి డిమాండ్‌కు అనుకూలంగా విత్తనాలు నాటి పనులను వేగవంతం చేయాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. అనంతరం చెన్నూర్ మండలం కిష్టంపేట సెక్టార్ పరిధిలోని కత్తెరసాల పంచాయతీ సుబ్బరాంపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు, తల్లులకు, గర్భిణులకు పౌష్టికాహారం అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో భీమారంలో ఎంపీడీవో మధుసూదన్, ఈజీఎస్ ఏపీఎం జీనత్, చెన్నూర్‌లో ఎంపీడీవో మోహన్, ఈజీఎస్ ఏపీవో గంగాభవాణి తదితరులు పాల్గొన్నారు.

నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో ఓపెన్‌హౌస్


ఆయుధాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై ప్రసాద్

నెన్నెల: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నెన్నెల పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ప్రసాద్ ఓపెన్‌హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన నెన్నెల ఉన్నత పాఠశాల విద్యార్థులకు పోలీస్‌స్టేషన్ పనితీరును నిర్వహించే రికార్డులు, విధులు, ఆయుధాలు, వాటి పనితీరు, పౌరులు పొందాల్సిన సేవల గూర్చి వివరించారు. డయల్ 100, షీ టీం, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ నేరాలు, ఫిర్యాదులు ఎలా చేయాలి, ఎఫ్ఐఆర్ నమోదు, చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రజల రక్షణ కోసమే పోలీసులు విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థానాల్లో స్థిరపడాలని కోరారు. రైఫిల్, ఏకే 47, రివాల్వర్, ఎస్ఎల్ఆర్ లాంటి తుపాకులను విద్యార్థులకు చూపిస్తూ వాటి పనితీరును వివరించారు. కార్యక్రమంలో పోలీసులు విజయ్, సత్యం, ప్రసాద్, ఉపాధ్యాయులు పురుషోత్తం, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై రైతులకు అవగాహన


కెపాసిటర్ల వినియోగం గురించి వివరిస్తున్న ట్రాన్స్‌కో ఏడీ, ఏఈ

జైపూర్: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ పొలంబాట కార్యక్రమంలో భాగంగా రైతులకు విద్యుత్ ప్రమాదాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏడీ బాలకృష్ణ, ఏఈ మనోహర్ రైతులకు వ్యవసాయ విద్యుత్ వినియోగం, ప్రమాదాలపై పలు సూచనలు చేశారు. కెపాసిటర్లు బిగించుకోవాలన్నారు. విద్యుత్ సమస్య తలెత్తితే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని, రైతులు స్వతహాగా విద్యుత్ మరమ్మతు చేపట్టకూడదని సూచించారు. కార్యక్రమంలో స్థానిక రైతులు, విద్యుత్ శాఖ సిబ్బంది ఉన్నారు.

సమాచారం

బ్యాంకింగ్ శిక్షణ దరఖాస్తు గడువు పొడిగింపు

మంచిర్యాలటౌన్: బ్యాంకింగ్/ఐబీపీఎస్(పీవోఎస్, క్లర్క్స్) పరీక్షల కోసం రాష్ట్రానికి చెందిన అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులకు అందిస్తున్న ఉచిత శిక్షణ కోసం దరఖాస్తుల గడువు ఈ నెల 27వరకు పొడిగించినట్లు జిల్లా గిరిజనాభివృద్ధి అధికారి గంగారాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 27వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అభ్యర్థులను మెరిట్, రిజర్వేషన్ పద్ధతిన ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. వివరాలకు 040–27540104లో ఉదయం 10:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంప్రదించవచ్చని, ఈ అవకాశాన్ని అర్హత గల అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

‘భరోసా బాట’ వాయిదా

బెల్లంపల్లి: దళితులు, నిరుపేద, అట్టడుగు వర్గాల ప్రజల సమస్యలను తెలుసుకోవాలనే లక్ష్యంతో బుధవారం నుంచి నిర్వహించే బెల్లంపల్లి పట్టణ భరోసా బాట కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలంగాణ దళిత సంఘాల ఐక్యవేదిక బెల్లంపల్లి పట్టణ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమాన్ని త్వరలోనే నిర్వహించనున్నట్లు, ఇందుకు సంబంధించిన తేదీని ప్రకటిస్తామని తెలిపారు. దళిత, గిరిజన సంఘాల శ్రేణులు సహకరించాలని కమిటీ విజ్ఞప్తి చేసింది.

24న క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు

బెల్లంపల్లి: ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 24న క్రికెట్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా సెక్రెటరీ బి.బాబురావు ఒక ప్రకటనలో తెలిపారు. మంచిర్యాల, కుమురంభీమ్ ఆసిఫాబాద్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు మంచిర్యాల జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తామని పేర్కొన్నారు. విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలతో పీడీ రాజయ్యకు ఉదయం 9గంటల వరకు రిపోర్టు చేయాలని సూచించారు.

25న పుట్‌బాల్..

రామకృష్ణాపూర్ తిలక్ స్టేడియంలో ఈ నెల 25న ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పుట్‌బాల్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహిస్తామని ఎస్‌జీఎఫ్ అండర్–19 జిల్లా సెక్రెటరీ బి.బాబురావు తెలిపారు. విద్యార్థులు ధ్రువీకరణ పత్రాలు, ఆధార్‌కార్డు తీసుకు రావాలని, ఉదయం 9గంటలకు హాజరై పీడీ మల్లికకు రిపోర్టు చేయాలని తెలిపారు. ఇతర వివరాలకు 9573615637 నంబరులో సంప్రదించాలని కోరారు.

అభ్యంతరాల స్వీకరణ

లక్సెట్టిపేట: 63వ జాతీయ రహదారి భూ సేకరణలో భాగంగా భూములు కోల్పోతున్న వ్యక్తులకు స్థానిక తహసీల్దార్ దిలీప్ కుమార్ గత కొద్ది రోజుల నుంచి నోటీసులు జారీ చేస్తున్నారు. భూములు కోల్పోతు న్న రైతులు ఈ నెల 23వ తేదీలోపు అభ్యంతరాలు తెలియజేయాలని కోరగా, మండలంలోని గుల్లకోట, మోదెల, పలు గ్రామా ల రైతులు మంగళవారం అభ్యంతరాల దరఖాస్తులను తహసీల్దార్‌కు అందజేశారు.

బొగ్గుబాయి వార్తలు

సింగరేణి భూములు కాపాడాలి

రామకృష్ణాపూర్: పట్టణంలోని సింగరేణి భూములను కాపాడేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్.వెంకటస్వామి మంగళవారం డిమాండ్ చేశారు. స్థానిక జయశంకర్ విగ్రహం వద్ద గల సింగరేణి ఖాళీ స్థలంపై క్యాతనపల్లి మున్సిపాలిటీ 22వ వార్డు కౌన్సిలర్ భర్త కన్నేశాడని ఆరోపించారు. ఇటీవల ఆ స్థలాన్ని చదును కూడా చేపించగా అక్కడ ఉన్న సింగరేణి సెప్టిక్ ట్యాంక్ కూడా ధ్వంసమైందని పేర్కొన్నారు. ఇప్పటికైనా సింగరేణి అధికారులు దీనిని గుర్తించి సింగరేణి స్థలం కబ్జా కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు. నాయకులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ప్రమోషన్లు

శ్రీరాంపూర్: అవినీతికి తావు లేకుండా సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ప్రమోషన్లు ఇప్పించామని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు తెలిపారు. ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్యలు మంగళవారం శ్రీరాంపూర్ ఓపెన్‌కాస్ట్ గనిపై జరిగిన గేట్ మీటింగ్‌లో కార్మికులను ఉద్దేశించి మాట్లాడారు. సీనియారిటీ ఆధారంగా అన్ని కేటగిరీల కార్మికులకు మొదటి సారిగా సర్ఫేస్ జనరల్ మజ్దూర్ ఇచ్చే విధంగా యాజమాన్యాన్ని ఒప్పించినట్లు తెలిపారు. ఎలాంటి అవకతవకలు లేకుండా నేడు ప్రమోషన్లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచ్ సహాయ కార్యదర్శి కొముురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, జీఎం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.